'మావి చిన్న జీవితాలు. కుటుంబమంతా తోపుడు బండి ఏర్పాటు చేసుకుని కొబ్బరి బొండాలు అమ్ముకుని బతుకుతున్నాం. 20 ఏళ్లుగా ఈ బండే మా జీవనాధారం. ఈ రోజు ఒక్కసారిగా మా దుకాణాన్ని, బండిని కూటమి పాలకులు నిర్దాక్షిణ్యంగా ఈడ్చి రోడ్డు మీదకు లాగేశారు. మా బతుకులు ఒక్కసారిగా రోడ్డు మీద పడ్డాయి...'

ఇదీ ఓ కొబ్బరి బొండాల వ్యాపారి ఆవేదన.

'మేయర్ గారూ.. మేం గంజాయి, డ్రగ్స్ అమ్మడం లేదు.. జామకాయలు అమ్ముకుని బతుకుతున్నాం. మీ కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లేసినందుకు మా కడుపు కొట్టారు. మీకు, మీ ప్రభుత్వానికి ఇది తగునా. మా జీవనాధారాన్ని తీసేశారు. ఇప్పుడు మేం బతికేదెలా..?'

ఇదీ ఓ జామకాయల వ్యాపారి ఆక్రోశం.

మేయర్ ఇలాకాలో కూటమి కర్కశత్వం



పెందుర్తిలో తోపుడుబళ్లను నిర్దాక్షిణ్యంగా రోడ్డుపైకి లాగి పడేస్తున్న పొక్లెయిన్లు

చిరు వ్యాపారుల కడుపుకొట్టిన పాలకులు, అధికారులు

పెందుర్తిలో దశాబ్దాలుగా నిర్వహిస్తున్న దుకాణాల కూల్చివేత

- ✔ భారీ పోలీస్ బందోబస్తు, పొక్లెయిన్లతో తోపుడుబళ్లు, బడ్డీలు ఊడ్చేసిన యంత్రాంగం
- ✔ దుకాణాల్లోని సామగ్రి తీసుకోనివ్వకుండా అమానుషంగా కూల్చివేత
- ✔ చిరు వ్యాపారులు కాళ్లావేళ్లా పడినా కనికరించని సిబ్బంది
- ✔ హఠాత్పరిణామంతో రోడ్డున పడ్డ వందలాది కుటుంబాలు

పెందుర్తి: తోపుడుబళ్లు, చిన్నపాటి బడ్డీల్లో వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఒక్కసారిగా రోడ్డున పడేసింది. కనీస సమాచారం, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా చిరువ్యాపారుల దుకాణాలను జీవీఎంసీ లాగి పడేసింది. అధికారులు, పోలీసులను బడుగు జీవులు కాళ్లావేళ్లా పడి బతిమిలాడుకున్నా కనీస మానవత్వం లేకుండా దుకాణాల్లో సామగ్రి ఉండగానే నిలువునా కూల్చివేశారు. తోపుడుబళ్లు, బడ్డీలు అధికంగా ఉండే సుజాతనగర్, చినముషిడివాడ, పెందుర్తి రైతుబజార్, పెందుర్తి పాత ప్రభుత్వాస్పత్రి వద్ద వందలాది మంది చిరు వ్యాపారులను రోడ్డున పడేశారు. పొక్లెయిన్ల సహాయంతో సామగ్రి సహా కూల్చివేయడంతో వారి జీవితాలు ఒక్కసారిగా అతలాకుతలమయ్యాయి. సామగ్రి అంతా శిథిలాల్లో ఉండిపోవడంతో ఆర్థికంగా కూడా తీవ్రంగా నష్టపోయారు.

సమాచారం లేకుండా.. సామగ్రి ఉండగానే..

జీవీఎంసీ జోన్ – 8 పరిధిలోని పెందుర్తి ప్రాంతంలో ఆపరేషన్ లంగ్స్ పేరిట ఫుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగిస్తూ విధ్వంస రచనకు అధికారులు బుధవారం తెరలేపారు. దశాబ్దాలుగా ఇక్కడ తోపుడుబళ్లు, బడ్డీల్లో వ్యాపారం చేసుకుంటున్న వారికి కనీసం ముందస్తు సమాచారం ఇవ్వలేదు. బుధవారం ఉదయాన్నే మందీమార్బలంతో సిద్ధమైన జీవీఎంసీ ఉన్నతాధికారులు ప్రణాళికాబద్ధంగా దుకాణాల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. తమ బతుకులు రోడ్డున పడేయవద్దంటూ వ్యాపారులు బతిమాలుతున్నా పట్టించుకోకుండా పొక్లెయిన్‌లు వాటి పని అవి చేసుకుంటూ పోయాయి. దుకాణాల్లో సామగ్రిని కూడా తీసుకోవడానికి కేవలం కొన్ని నిమిషాల సమయం అడిగినా అధికారులు ఒప్పుకోలేదు. చివరకు దుకాణాలు కూల్చివేసిన తర్వాత ఆ శిథిలాల్లో ఉండిపోయిన సామగ్రిని విలపిస్తూ చిరు వ్యాపారులు బయటకు తీయడం చూసిన సామాన్యులు సైతం ప్రభుత్వ తీరును తప్పుబట్టారు.

ప్రతిఘటనతో తీవ్ర ఉద్రిక్తత

పెందుర్తి రైతు బజార్ వద్ద దుకాణాల తొలగింపు సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సీఐటీయూ మద్దతుతో పదుల సంఖ్యలో వ్యాపారులు తొలగింపు ప్రక్రియను కాసేపు అడ్డుకున్నారు. అయితే జీవీఎంసీ ఉన్నతాధికారులు పోలీస్ బందోబస్తును కోరడంతో తక్షణమే అక్కడకు చేరుకున్న పోలీసులు వ్యాపారులను పక్కకు లాగేశారు. రోప్‌లు ఏర్పాటు చేసి వారిని నిర్బంధించారు. అనంతరం అధికారులు యంత్రాలతో దుకాణాలను నిలువునా కూల్చివేసి లారీల్లో తరలించారు.







చిరు వ్యాపారులను రోప్‌తో అడ్డుకుంటున్న పోలీసులు



జీవితం తలకిందులు చేసేశారు



నేను పెద్దగా చదువుకోలేదు. చిన్నప్పుడే కుటుంబ భారం మీదన పడడంతో తోపుడుబండి వ్యాపారం ప్రారంభించాను. ఇప్పటికి 30 ఏళ్లుగా బండి మీద రూ.10, రూ.20 వస్తువులు అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఈ రోజు మా దుకాణం ఎదురుగా పొక్లెయిన్ వచ్చి ఆగడంతో నిర్ఘాంతపోయాను. ఫుట్‌పాత్ మీద నా బండి లేకపోయినా నిలువునా బయటకు లాగేశారు. ఒక్కసారిగా నా జీవితం తలకిందులైంది. ఈ కూటమి ప్రభుత్వం మానసికంగా నన్ను కుంగిపోయేలా చేసింది. నాకేం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత.

– సత్యనారాయణ, చిరు వ్యాపారి, పెందుర్తి రైతుబజార్

కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు



30 ఏళ్లుగా రైతు బజార్ వద్ద చిన్న బడ్డీ పెట్టుకుని వ్యాపారం చేసుకుంటూ కుటుంబమంతా బతుకుతున్నాం. ఉదయాన్నే బడ్డీ కూల్చేందుకు జీవీఎంసీ అధికారులు, సిబ్బంది వచ్చారు. బడ్డీ కూల్చేస్తామని చెప్పడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాను. జీవీఎంసీ అధికారులు, పోలీసులను ఎంత బతిమిలాడుకున్నా పట్టించుకోకుండా కూల్చివేసి వెళ్లిపోయారు. ఇప్పుడు మా బతుకులు ఏంటో అర్థం కావడం లేదు.

– తార, చిరు వ్యాపారి

శిథిలాల్లో బతుకులు చిక్కుకుపోయాయి



ఉదయం నుంచి మా దుకాణంలో సామగ్రి తీసుకుంటామని చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొబ్బరి బొండాలు, ఇతర సామగ్రి అందులో ఉండగానే దుకాణాన్ని నిలువునా కూలగొట్టారు. ప్రభుత్వ కర్కశత్వంతో మా బతుకులు శిథిలాల్లో చిక్కుకుపోయాయి. ఇప్పుడు బయటకు రావడం ఎలాగో అర్థం కావడం లేదు.

–వనం వెంకటరావు, వ్యాపారి, పెందుర్తి



జీవీఎంసీ సిబ్బందిని నిలదీస్తున్న చిరు వ్యాపారి



ముందస్తు సమాచారం ఇవ్వకుండా బడ్డీలు, దుకాణాలను తొలగించడంతో సామగ్రి ఏరుకుంటున్న చిరు వ్యాపారులు

ప్రభుత్వానికి మా ఉసురు తగులుతుంది



పెందుర్తిలో రైతుబజార్, పోలీస్ స్టేషన్ లేనప్పటి నుంచే మా కుటుంబం సైకిల్ మీద దుకాణం నిర్వహిస్తోంది. మా మామయ్య గారున్నప్పటి నుంచి ఇప్పటి వరకు తరాలుగా ఇక్కడే జీవనం సాగిస్తున్నాం. మేం ఎక్కడా రోడ్డు ఆక్రమణకు పాల్పడలేదు. జీవీఎంసీకి అన్ని రకాల పన్నులు, ఆశీలు కడుతున్నాం. కానీ ఒక్కసారిగా వచ్చి కూల్చేశారు. మేం తింటున్న అన్నాన్ని కంచంలో నుంచి రోడ్డు మీద పడేసి తినమన్నట్లు ఈ ప్రభుత్వం చేసింది. మా ఉసురు ఈ ప్రభుత్వానికి ఖచ్చితంగా తగులుతుంది.

– ప్రభావతి, చిరు వ్యాపారి

నమ్మి ఓట్లేస్తే.. రోడ్డున పడేశారు



మొన్నటి ఎన్నికల్లో మాకు ఓట్లు వేయండి... మీ జీవితాలు మార్చేస్తాం అని టీడీపీ, జనసేన నాయకులు మా చుట్టూ తిరిగారు. ఇప్పుడు నిజంగానే మా జీవితాలు మార్చేశారు. రోడ్డున పడేశారు. చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్న మమ్మల్ని ఒక్కసారిగా రోడ్డు మీదకు ఈడ్చేశారు. ఆడపిల్లలతో బతుకుతున్నాం. ఇదేనా కూటమి నాయకులను నమ్మి ఓట్లేసినందుకు మాకు ఇచ్చిన ప్రతిఫలం.

– అనసూయ, చిరువ్యాపారి, పెందుర్తి



దుకాణాలు కూల్చడంతో విలపిస్తున్న మహిళ



చిరు వ్యాపారులను లాక్కెళ్తున్న పోలీసులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

సబ్బవరం: శిక్షణను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై పెందుర్తి, సబ్బవరం మండలాల్లోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణను సబ్బవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితిలోని 154 సభ్యదేశాలు సుస్థిర అభివృద్ధి సాధనకు లక్ష్యాలు నిర్దేశించుకుని ఒప్పందం చేసుకున్నాయన్నారు. అట్టడుగు స్థాయి నుంచి గ్రామాలను అభివృద్ధి చేయాలని 17 అంశాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం 9 థీమ్స్‌గా ఏర్పాటు చేసిందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో చైతన్య, పెందుర్తి డిప్యూటీ ఎంపీడీవో కామేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి

సబ్బవరం: విద్యార్థి దశ నుంచే సమాజ సేవపై అవగాహన పెంచుకుని భాగస్వాములవ్వాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ సూచించారు. స్థానిక కళాశాలలో బుధవారం నిర్వహించిన జాతీయ సేవా పథకం వేడుకల్లో ఆయన మాట్లాడారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, రజిని, డాక్టర్ లెక్కల గణేష్ పాల్గొన్నారు.

మోక్ష రథం ప్రారంభం



మోక్ష రథం ప్రారంభిస్తున్న శ్రీనివాస్, దాతలు

పెందుర్తి : స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో సమకూర్చిన మోక్షరథం (పార్థివ దేహాలను తరలించే వాహనం)ని బుధవారం ప్రారంభించారు. పెందుర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, దాతలు డీబీఎల్ నాయుడు, సంతోష్, దాడి సురేష్‌బాబు, పెతకంశెట్టి ఉమాశంకర్, దాడి ఉమామహేష్, పెంటకోట గణేష్, తిమ్మా నారాయణతేజ, దెందేటి కృష్ణ, యల్లపు అనిల్‌కుమార్, సీరపు మహేష్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై గ్రామసభ

పెందుర్తి : వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్మించనున్న వేపగుంట – పినగాడి రహదారిలో భూములు, స్థలాలు కోల్పోతున్న పినగాడి, రాంపురం గ్రామస్థులతో బుధవారం గ్రామసభ నిర్వహించారు. పినగాడిలోని కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఐ.వెంకట అప్పారావు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న వారు అభ్యంతరాలను తెలియజేయాలని సూచించారు. వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారి అరుణవల్లి, సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి జయరామ్, నాయకులు బయిలపూడి భగవాన్ జయరామ్, రెడ్డి నారాయణరావు, బొడ్డు అప్పలరాజు, సబ్బవరపు రాంకుమార్, వెన్నెల పెంటబాబు, సర్వేయర్ శ్రీరాంమూర్తి, వీఆర్వోలు సుబ్బారావు, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అమ్మవార్లకు తిరువీధి

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం సువర్ణ అమ్మవారు, చతుర్భుజతాయారు అమ్మవార్లకు విశేషంగా తిరువీధి జరిగింది. అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్టింపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించి విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో రామాయణ పారాయణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



అమ్మవార్లకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకుడు, సిబ్బంది

చిరు వ్యాపారుల పొట్ట కొడుతున్న కూటమి ప్రభుత్వం

పెందుర్తి : పండగ వేళ చిరువ్యాపారుల జీవితాలను కూటమి ప్రభుత్వం చీకటిమయం చేసిందని వామపక్ష నాయకులు ఆరోపించారు. ఆపరేషన్ లంగ్స్ పేరిట నగరంలోని తోపుడుబళ్లు, బడ్డీ వ్యాపారులపై ప్రభుత్వం కక్ష సాధింపునకు నిరసనగా బుధవారం వేపగుంటలోని జోనల్ కార్యాలయం వద్ద వామపక్షాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నేత వెంకటరెడ్డి, సీపీఐ నేతలు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం చిరు వ్యాపారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఎక్కడెక్కడ వ్యాపారాలు చేసుకున్నారో వారికి అక్కడే అవకాశం కల్పించాలన్నారు. లేకపోతే కూటమి ప్రభుత్వంలోని కార్పొరేటర్ల ఇళ్ల ముట్టడితోపాటు భారీ ఉద్యమం చేపడతామన్నారు. చిరు వ్యాపారులకు హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.



వేపగుంటలోని జోన్ - 8 కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

రేపు జాబ్ మేళా

మురళీనగర్: ఉపాధి కార్యాలయంలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. 900 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు నైపుణ్యం.ఏపీజీఓవీ.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిట్ కార్డ్‌తో హాజరు కావాలని తెలిపారు.

అన్నపూర్ణాదేవిగా ఉమాదేవి



విజినిగిరిపాలెంలో అన్నపూర్ణాదేవిగా ఉమాదేవి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉమాదేవి అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేషంగా అభిషేకాలు నిర్వహించి అన్నపూర్ణగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.



ఎరుకునాయుడుపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న శేషుబాబు తదితరులు

ఎరుకునాయుడుపాలెంలో..

సబ్బవరం: మండలంలోని ఎరుకునాయుడుపాలెంలో దుర్గాలమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాపుశెట్టి శేషుబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. గవర అప్పారావు, మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ, ఉప సర్పంచ్ కరణం సురేష్, కాపుశెట్టి నీలవేణి, కర్రి హరికృష్ణ, మడక నాయుడు, నక్క తాతారావు, దాలిబోయిన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం గాజువాక దరి శ్రీనగర్‌కాలనీకి చెందిన మండవ మహేష్ రూ. లక్ష 116 విరాళం పీఆర్‌వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో అందజేశారు. దేవస్థానం తరఫున ప్రోటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సునీల్ బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో అప్పలనాయుడు పాల్గొన్నారు.



దాత చంద్రకాంత్, అమృత దంపతులకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ సునీల్

